తప్పని పడిగాపులు

- పత్తి విక్రయానికి అరిగోస పడుతున్న సామాన్య రైతులు
- టోకెన్ల కేటాయింపులో పైరవీలకు పెద్దపీట
- పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు



చెన్నూర్ జాతీయ రహదారిపై బారులు తీరిన పత్తి వాహనాలు

చెన్నూర్: పంట అమ్మేందుకు రైతులు అరిగోస పడుతున్నారు. సీసీ ఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపడుతున్న తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పైరవీలకు పెద్దపీట వేస్తున్నారని, సామాన్య రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పండించిన పంటను అమ్ముకునేందుకు రెండు రోజులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పత్తి రైతుల పరిస్థితి..

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల రైతులు పత్తి అమ్మకానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీసీఐ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన గల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తేమ శాతం పరీక్షలు నిర్వహించి, అధికారులు కొనుగోళ్ల టోకన్లను అందజేస్తున్నారు. గతంలో ప్రతీరోజు వందలాది పత్తి వాహనాలకు టోకన్లు అధికారులు అందజేశారు. గత రెండు రోజుల క్రితం రోజుకు 150పత్తి వాహనాలు తీసుకొని రావాలని అధికారులు ప్రకటన చేశారు. దీంతో శనివారం సాయంత్రం నుంచి రైతులు పత్తి వాహనాలను మార్కెట్ కార్యాలయం ఎదుట వరుస క్రమంలో పెట్టారు. శనివారం నుంచి సోమవారం వరకు 450కి పైగా వాహనాలు రావడంతో పైరవీలు చేసిన రైతుల వాహనాలకు టోకన్లు ఇచ్చి పంపిస్తుండడంతో రెండు రోజుల నుంచి వాహనాలు తీసుకొని వచ్చిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల పాటు వాహనాలకు వేటింగ్ చార్జీలు చెల్లించి నష్టపోతున్నామని రైతులు వాపోయారు.

దిగుబడి, ధర లేక..

ఈ ఏడాది పత్తి దిగుబడి రెండింతలు తగ్గింది. ఎకరానికి 15నుంచి 20క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరానికి 5 నుంచి 10క్వింటాళ్ల పత్తి చేతికి వచ్చింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక పక్క దిగుబడి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క పత్తి ధర క్వింటాకు రూ.6920కి పడిపోయింది. తగ్గిన పత్తి ధరలకు పంట కోసం చేసిన అప్పులు చేతికి వచ్చే పరిస్థితి లేక రైతులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు రెండు రోజులుగా పత్తి వాహనాలు ఉంచడంతో వేయిటింగ్ చార్జీలు తడిసి మోపడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో అక్రమాలు జరగకుండా జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బండెనక బండి.. పత్తి అమ్మేందుకండి..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఓ పత్తి మిల్లు ఎదుట పత్తి అమ్ముకునేందుకు ఎడ్లబండ్లలో వచ్చి రైతులు ఇలా బారులు తీరారు. టోకెన్ల కోసం చెన్నూర్‌లోని కాటన్‌మిల్లుకు వెళ్లగా ఎడ్లబండ్లను ఇలా లైన్‌లో ఉంచారు. ఈ చిత్రాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

దండేపల్లిలో...

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి సమీపంలో గల జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోళ్లు జరుగుతుండగా, సోమవారం భారీగా పత్తి వాహనాలు తరలివచ్చాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా పత్తి లోడుతో ఇలా వాహనాలు నిలిపి ఉంచారు.



రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉన్న వాహనాలు

నంబర్లు మారుతున్నాయి..



పత్తి అమ్మేందుకు శనివారం బండి తెచ్చాను. మొదట నాకు 49నంబర్ ఇచ్చారు. సోమవా రంనా నంబర్ 179కి చేరింది. అధికారులు పైరవీకారులకు పెద్దపీట వేస్తున్నారు. చిన్న రైతులను పట్టించుకోవడం లేదు. రెండు రో జుల నుంచి బండి వేయిటింగ్ చార్జీ కడుతు న్నా. పత్తి దిగుబడి లేక నష్టాల పాలైతే. పత్తి అమ్మేందుకు వచ్చి మ రింత నష్టపోతున్నాం. జిల్లా అధికారులు పత్తి టోకన్ల పంపిణీ విషయంలో జరిగే అక్రమాలను అరికట్టాలి.

– చల్లా శ్రీరాములు, పత్తి రైతు

గోస పడుతున్నం



మూడు రోజులుగా పడిగాపలు కాస్తున్నాం. పత్తి అమ్ముకునేందుకు గోసైతంది. ఆఫీసు లోపల ఏం జరుగుతుందో తెలియదు. టోకన్ల కేటాయింపులో మాత్రం చిన్న రైతులకు అన్యాయం జరుగుతుంది. అధికారులు పత్తి మిల్లుల వద్దనే తేమశాతం పరీక్షించి పత్తి కొనుగోళ్లు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి. టోకన్ల పంపిణీ పేరుతో వాహనాల వేయిటింగ్ చార్జీలకు మేము నష్టపోతున్నాం.

– జిల్లాల రాజేశ్, రైతు

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు..



రైతులకు పత్తి టోకన్ల పంపిణీ, ఇతర అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. సీసీఐ, మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడి అవకతవకలు జరగకుండా చూస్తాం. సీసీఐ కొనుగోళ్లను పరిశీలించాం. పత్తి కొనుగోళ్లు జరిగే వరకు పర్యవేక్షిస్తాం.

– రవీందర్, సీఐ చెన్నూర్

వినతిపత్రం అందజేత

బెల్లంపల్లి: నేషనల్ హైవేను ఆనుకుని బెల్లంపల్లి నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వం నుంచి లైసెన్స్ తీసుకోకుండా అక్రమంగా నిర్వహిస్తున్న సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంద అనిత తెలిపారు. మంచిర్యాలలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతి లేకుండా కొందరు అక్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు, వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. నేషనల్ హైవే స్థలాన్నీ అనుమతి లేకుండా వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారని, కొన్ని చోట్ల హైవే పక్కన మద్యం షాపులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా హైవే పక్కన వ్యాపారాలు సాగిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇందులో నేషనల్ హైవే, పోలీసు అధికారుల తప్పిదం ఉందని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ హైవే ఆనుకుని సాగిస్తున్న వ్యాపారాలను నియంత్రించాలని లేదా క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

సైకాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ మంచిర్యాల జిల్లా శాఖ సంఘం సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సమాజం బాగు కోసం, వివిధ మానసిక సమస్యలను తొలగించి, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు సైకాలజిస్టులు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుడు గుండేటి యోగేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతి నారాయణరావు, కార్యదర్శి చెరుకు శశికిరణ్, హెచ్. దేవాని, సుమన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారిని కాపాడిన వ్యక్తికి సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం శ్రీనివాస కాలనీలో ఓ చిన్నారిని ఒక మహిళ తీసుకెళ్తుండగా, అడ్డుకుని ఆ మహిళను స్థానికులకు అప్పగించి, చిన్నారిని కాపాడిన ఆశీర్వాద్ విల్సన్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తన నివాసంలో సన్మానించారు. బీఆర్‌ఎస్ 10వ వార్డు జనరల్ సెక్రటరీగా ఉన్న ఆశీర్వాద్ చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే వారిని పసిగట్టి, పట్టుకున్నందుకు ఆ చిన్నారి తల్లిదండ్రులు, మాజీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి ఖర్జీలో సమ్మక్క జాతర

నెన్నెల: మండలంలోని జంగాల్‌పేట పంచాయతీ పరిధిలో ఖర్జీ శివారు అటవీలో ఈ నెల 14నుంచి 16వరకు సమ్మక్క–సారక్క జాతర ప్రారంభం కానున్నట్లు పూజారి అద్దెరపల్లి బాపు తెలిపారు. 14న సమ్మక్క, 15న సారలమ్మలను భాజాభజంత్రీలతో గద్దెల వద్దకు తీసుకొచ్చి నెలకొల్పనున్నట్లు చెప్పారు. గిరిజన దేవతలకు మొక్కులు చెల్లించేందుకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా మూడు రోజుల పాటు జరిగే వనదేవతల జాతరలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

వార్డు కౌన్సిలర్ రాజీనామా

మంచిర్యాలటౌన్: మున్సిపాలి టీ 16వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ తన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తూ మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు తన రాజీనామ పత్రాన్ని సోమవారం అందించారు. తనకు ఉన్న వ్యక్తిగత కారణాలతో బీఆర్‌ఎస్ పార్టీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో సైకియాట్రిస్ట్ సేవలు

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వారాంతానికొకసారి సైకియాట్రిస్ట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రెగ్యూలర్ వైద్యుని నియమించకుండా వారంలో ఒకరోజు సైకియాట్రిస్ట్ ఏరియా ఆసుపత్రికి వచ్చి రోగులకు వైద్యసేవలు అందించనున్నారు. ఈ మేరకు సోమవారం సైకియాట్రిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ ఏరియా ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు అందించారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి కోరారు.

రోడ్డు నిర్మాణం కోసం సర్వే

బెల్లంపల్లిరూరల్: మండలంలోని అంకుశం గ్రామ పంచాయతీ పరిధిలోని గోండు గూడెం గ్రామం మీదుగా శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేశారు. రూ.2.60కోట్ల ఐటీడీఏ నిధులతో తాండూర్ మండలం బోయపల్లి నుంచి గోండు గూడెం మీదుగా బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టులను, కాలువలను పరిశీలించారు.


సమస్యలు పరిష్కరించాలి

భీమారం: జైపూర్ మండల కేంద్రంలో సింగరేణి సంస్థ థర్మల్ పవర్‌ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ సోమవారం జనరల్ మేనేజర్ చిన్న బుస్విరెడ్డిని శాలువాతో సన్మానించి కార్మికుల సమస్యలను వివరించారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. సత్తయ్య, కృష్ణ, భాస్కర్, శివకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భీమిని: మార్చి 3, 4, 5తేదీల్లో ఖమ్మంలో జరిగే సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆల్ ఇండియా పార్టీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి జాడిదేవరాజ్ పిలుపునిచ్చారు. భీమిని మండలంలోని భీంపూర్‌లో సోమవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. లాల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నెన్నెల మండలంలోని గుండ్లసోమారంలో సోమవారం భారత్ బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దుగుట రాజిరెడ్డి, రాజక్క, నాయకులు పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాల జాతర

- రెండు ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- శివసత్తుల పూనకాలతో ఆధ్యాత్మిక శోభ



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

చెన్నూర్: పట్టణంలో లక్ష్మీదేవర బోనాల జాతర కనుల పండువగా జరిగింది. స్థానిక బట్టిగూడెం, పాత బస్టాండ్ ముదిరాజ్ కాలనీలలో గల అమ్మవారి ఆలయాల వద్ద బోనాల జాతరకు భక్తజనం పోటెత్తారు. లక్ష్మీదేవర ఆనవాయితీ ప్రకారం అమ్మవారి పట్నాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వివిధ పట్టణాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు గిరెల్లి మల్లయ్య, గడ్డం రాములు, పోచయ్య, గడ్డం శంకర్, కుల పెద్దలు నాయిని మదునయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు జోడు శంకర్, తుమ్మ రమేశ్, నాయిని శ్యామల పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం



సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికైన రావుల ఉప్పలయ్య, సల్ల మహేశ్‌లను జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి వి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నల్ల శంకర్, పోడేటి రాజు, నాయకులు సత్యపాల్‌రెడ్డి, కొండల్‌రావు, రవీందర్‌రావు, నాంపల్లి శ్రీను పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున సమ్మక్క, సారక్క జాతర ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం పర్మినెంట్ నిర్మాణాలైన స్నానపు గదులు, మరుగుదొడ్లను నిర్మించే పనులను పరిశీలించి, వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నిధులు తీసుకొచ్చారని, వాటితో పనులను పూర్తి చేసి, ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



మంచిర్యాల జిల్లా కేంద్రంలో...



జైపూర్‌లో...

దండేపల్లి/పాతమంచిర్యాల/లక్సెట్టిపేట/భీమారం/నస్పూర్: మార్కండేయ జయంతి పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. మార్కండేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నైవేద్యం వండి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాటలు పాడుతూ..భజనలు చేస్తూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నస్పూర్‌లో శ్రీ లక్ష్మీ గణపతి శివ మార్కండేయ దుర్గామాత ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో దండేపల్లిలో శంకర్, దేవయ్య, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గంగాధర్, మురళి, శంకర్, రామస్వామి, దేవేందర్, సత్యం, తిరుపతి, జిల్లా కేంద్రంలో గజెల్లి వెంకటయ్య, బూర్ల బోస్, జ్ఞానీ, వెంకటేష్, దామోదర్,



దండేపల్లిలో జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు

ఆడిచర్ల రాజేశం, లక్సెట్టిపేటలో రాజగురువయ్య, పోతు మహేష్, వేముల చందు, సుధాకర్, రమేష్, వెంకటేష్, చంద్రయ్య, జైపూర్‌లో కర్నె భూమయ్య, దుస్స భాస్కర్, చిలకాని వెంకటేష్, డాక్టర్ శంకర్, నస్పూర్‌లో సిరిపురం రామన్న, కొండ శ్రీనివాస్, కుసుమ శంకర్, చిలగాని బొడ్డయ్య, బండి పద్మ, వేముల సురేష్, చిప్ప రాజబాబు, పద్మశాలి కులస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని శాంతిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పెయింటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా స్థాయిలో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో శాంతిఖని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏడో తరగతి చదువుతున్న లెక్కల సాయి దీక్షిత్ 'సేవ్ వాటర్' అనే అంశంను అత్యుత్తమంగా ప్రదర్శించాడు. ద్వితీయ బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సాయి దీక్షిత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమంగా రాణించాలని ఆకాక్షించారు.

దండేపల్లి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో దండేపల్లి మండలం గుడిరేవు ఉన్నత పాఠశాల విద్యార్థి అంజి ప్రతిభ కనబరిచాడు. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. పాఠశాల హెచ్‌ఎం మల్లూరి శ్రీనివాస్, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

యోగాసన పోటీల్లో బంగారు పతకం

మంచిర్యాలటౌన్: ఈ నెల 11, 12న యోగా అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో సీహెచ్.రాహుల్ బంగారు పతకం సాధించారు. జిల్లా నుంచి పాల్గొని 700 రౌండ్లు చేసి స్వర్ణ పతకం గెలుపొందినందుకు జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి వర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అభినందించారు.


తాగునీటికి ఇబ్బందులు

మంచిర్యాలటౌన్: పట్టణం నుంచి పాతమంచిర్యాలకు నీటి సరఫరా చేసే పైపులు పగిలిపోయాయి. దీంతో రెండు రోజులుగా పాతమంచిర్యాలకు తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. రోడ్డు మరమ్మతు పనుల్లో పైపులు పగిలిపోవడంతో, వాటికి మరమ్మతులు చేస్తున్నా, అవి పూర్తి కాకపోవడంతో తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రయోగ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 696మంది విద్యార్థులకు గాను 667మంది హాజరుకాగా 29మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 531మందికి గాను 512మంది హాజరుకాగా 19మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 165మందికి గాను 155మంది హాజరుకాగా 10మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 437మందికి గాను 421మంది హాజరుకాగా 16మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 292మందికి గాను 276మంది హాజరుకాగా 16మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 145మందికి గాను 145మంది హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు.

టీయూడబ్ల్యూజే యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 2024 డైరీని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి సంపత్‌కుమార్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు డేగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, కోశాధికారి కౌట్టి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు


జన్నారం/వేమనపల్లి/భీమారం/చెన్నూర్‌రూరల్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైంది. జన్నారంలో అధికారులు హాజరుకాలే దు. ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఎమ్మార్పీ బుచ్చయ్య మాత్రమే హా జరయ్యారు. వేమనపల్లిలో ఎంపీడీఓ లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి ఆలస్యంగా ప్రారంభమైంది. మొక్కుబడిగా నిర్వహించారు. ఉ పాధిహామీ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది మాత్రమే పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు హాజరుకాలేదు. భీమారంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక దరఖాస్తు వచ్చింది. చెన్నూర్‌లో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఎంపీడీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



భీమారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో



జన్నారం: ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు



చెన్నూర్‌లో పాల్గొన్న అధికారులు

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

చీడ,పీడల నివారణపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట, ఎల్లక్కపేట గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏఈవో సాయికృష్ణ సోమవారం పంటలపై క్షేత్ర పర్యటన చేపట్టారు. రైతులు ఏయే పంటలు సాగు చేశారో నమోదు చేశారు. చీడ, పీడలు వాటి నివారణ చర్యల గురించి రైతులకు తెలియజేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహించే గంగాపురం వెంకటరమణ(61) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇటీవల నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఎంపీడీవోలకు సన్మానం

కోటపల్లి/బెల్లంపల్లిరూరల్: సాధారణ బదిలీల్లో భాగంగా కోటపల్లిలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో భాస్కర్‌ను, బెల్లంపల్లిలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న డిబిలిపురం రాజేందర్‌ను మండల ప్రజాపరిషత్ సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు

భీమారం/వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు. సోమవారం పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించగా ప్రత్యేకాధిరులు పరిశీలించారు.

శ్రీరాంపూర్ ఎస్సైగా సంతోష్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన ఎస్సైగా మేకల సంతోశ్ బదిలీపై వస్తున్నారు.

హాజీపూర్ ఎస్సైగా సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ఎస్సైగా జి.సురేశ్ నియామకం అయ్యారు.